**ఆ** రోజు లెక్కల మాష్టారు వెంకటేశ్వరరావుగారు ఆల్జీబ్రా చెబుతున్నారు. లెక్కలంటే నాకు మొదటి నుంచీ భయమే! అందులోనూ ఆల్జీబ్రా.... గుండె గాబరా అన్నట్లు ఉగ్గపట్టుకొని ఆయన చెప్పేది అర్థం కాకపోయినా దిక్కులు చూస్తే మధ్యలో లేపి ఎక్కడ ప్రశ్నలు వేస్తాడోనని ఫుల్ టెన్షన్‌తో వింటున్నాను. క్లాసులో నాతో పాటు మరి కొంతమంది పరిస్థితి కూడా అలాగే వుంది.

# హైలీ కమాండబుల్ సర్టిఫికేట్

## డాక్టర్ నక్కా విజయరామరాజు

ఇంతలో అటెండర్ సోమయ్య నోటీసు తీసుకొని మా క్లాసుకొచ్చాడు. మా స్కూల్లో ఇద్దరు అటెండర్లు పనిచేసేవాళ్లు. ఒకరు మహబూబ్, మరొకరు సోమయ్య. వీరిలో మహబూబ్ తెచ్చే నోటీసుల్లో మా కిష్టమైన సెలవులనో, అసెంబ్లీ హాలులో సినిమా అనో, డాన్సు ప్రోగ్రామో, మ్యూజిక్కో, లేకపోతే మా స్కూలు ధర్మకర్త తమ్మన మల్లికార్జునరావుగారి మనవరాలి పుట్టిన రోజు కనుక అందరికీ న్యూట్రిన్ చాక్లెట్లు పంచబడతాయనో వుండేవి. ఇక సోమయ్య తెచ్చే నోటీసులు... వచ్చేవారం నుంచే పరీక్షలనీ.... ఫీజు కట్టని వారి పేర్లో... అల్లరిచిల్లరగా తిరిగే పిల్లల్ని హెడ్మాస్టరు పిలుస్తున్నారనో... క్లాసులు ఎగ్గొట్టే వారి పేర్లు, మార్కులు తక్కువ వచ్చిన వారివి, సస్పెండ్ అయిన వారివి, స్కూలు నుంచి టిసి ఇచ్చి పంపిన వారివి... అలా వుండేవి.

అందుకే సోమయ్య చేతిలో నోటీసుతో ప్రత్యక్షమయ్యేసరికి మనసు ఏదో కీడు శంకించింది.

పాఠం మధ్యలో ఆగినందుకు మాష్టారు ఆ కాగితాన్ని చిరాగ్గా తీసుకుని చింతకింత వెంకట సాంబశివరావు, మాచెర్ల రంగారావు, నక్కా విజయరామరాజు... అని పెద్దగా చదివేసరికి మా గుండెలు గొంతులోకి వచ్చినంత పనైంది. మా ముగ్గురిది ఒకే ఊరు. మాకు తెలీకుండానే లేచి నిలబడ్డాం. ఆ కాగితాన్ని సోమయ్య మొహాన కొట్టి A+B హోల్‌స్క్వేర్ $=A^2+B^2+2AB$ అంటూ ఆల్జీబ్రాలో పడ్డారు మాష్టారు. మిగిలిన స్టూడెంట్స్ అంతా పాఠం వింటూ మధ్య మధ్యలో మా వంక అదోలా చూడసాగారు మేమేదో నేరగాళ్లమైనట్లు.

''ఏమైందిరా?'' అన్నట్లు కొంతమంది కళ్లు ఎగరేసి అడుగుతున్నారు.

అసలేం జరిగిందో మాకు మాత్రం ఏం తెలుసు? క్లాసులెగ్గొట్టి పెద్ద కాలువలో ఈతలెయ్యడం, చింత చెట్టెక్కి కోతికొమ్మచ్చి ఆడడం, బస్టాండులో కానీ సోడాకొట్టు దగ్గర కూర్చుని వచ్చేపోయే వాళ్లను చూడడం లాంటి పనులేమైనా చేశానా? అని గుర్తుతెచ్చుకోసాగాను. వీటిల్లో ఈత ఒక్కటే నా దురలవాటు. ఎంత మంది చెప్పినా పెద్ద కాలువలో ఈతవేయడం మానేవాడిని కాదు. క్లాసులెగ్గొట్టలేదు. మార్కులు బాగానే వస్తున్నాయి. నా మెదడు ఆల్జీబ్రా కన్నా గందరగోళంగా తయారు అయింది. ఇంతలో బెల్ మోగడంతో నా ఆలోచనలకు తెరపడింది. మాష్టారు పాఠం ముగించి మా వంక తిరిగి 'మిమ్మల్ని హెడ్మాష్టారు రమ్మన్నారు. పోయి కలవండి' అన్నారు. అసలే హెడ్మాష్టారు అంటే హడల్.

అయితే అసలు క్లాసు హెడ్మాష్టారు తీస్తారన్న మాట. క్లాసులో పిల్లలంతా మమ్మల్నే చూడసాగారు. మాష్టారు బయటకు రాగానే మేం ముగ్గురం ఒకర్నొకరు 'ఏమైందిరా? అంటే ఏమైందిరా' అనుకుంటూ హెడ్మాష్టరు రూం దగ్గరకెళ్లాం దిగులుగా.

అప్పటికే అక్కడ దిబ్బ సూరపల్లిలో వుండే దొడ్డా భాస్కరరావు, పెద్దబజారు బూర్లె రామప్రసాదు, మానెపల్లి శంకర్రావు, అద్దేపల్లి ఆదెయ్య, పంచుమర్తి వెంకట సుబ్బారావు, పెనమత్రు మధు వున్నారు. 'ఏమైందిరా?' అని దొడ్డా భాస్కరరావుని అడిగితే 'ఏమో నాకూ తెలియదురా' అన్నాడు వాడు.


''హెడ్మాష్టారు మిమ్మల్ని లోనికి రమ్మంటున్నాడు'' అటెండర్ మహబూబ్ చెప్పాడు. మేమంతా హెడ్మాష్టారు గుర్నాధరావుగారి గదిలోకి వెళ్లాం భయం భయంగా. ఆయన ఎదురుగ్గా చక్కా సుబ్బారావు మాష్టారు. డ్రాయింగ్ మాష్టారు జిలాని కూర్చొని ఏదో మాట్లాడుకుంటూ మమ్మల్ని చూసి ఆపేశారు.

హెడ్మాష్టారు మా అందరి వంకా ఒకసారి చూసి నోట్లో రాజశ్రీ వక్కపొడి వేసుకొని కొంచెంసేపు చప్పరించి, 'మన స్కూలు పేరు నిలబెట్టినందుకు కంగ్రాట్యులేషన్స్ రా' అన్నాడు నవ్వుతూ ఏ ఉపోద్ఘాతం లేకుండా.

మేం చేసిన మంచి ఏమిటో తెలియక ఒకరి మొహాలొకరం చూసుకున్నాం.

చక్కా సుబ్బారావు మాష్టారు మధ్యలో కలగజేసుకొని 'మీరు రంగులు వేసి పంపిన బొమ్మలకు బహుమతులు, సర్టిఫికెట్లు వచ్చినయిరా బాలక్కాయలు. రేపు వెల్లటూరులో జరిగే ఫంక్షన్‌లో మంత్రిగారు స్వయంగా మీకు బహుమతులు అందజేస్తారు' అన్నాడు. టెన్షన్‌లో వున్న మా అందరి ముఖాలు ఒక్కసారిగా మతాబుల్లా వెలిగిపోయాయి.

## భట్టిప్రోలు కథలు



''మీరంతా రేపు మధ్యాహ్నం ఒంటి గంటకు జానీ సోడాకొట్టు దగ్గరుండాలి. నేను, డ్రాయింగు మాష్టారూ మిమ్మల్ని తీసుకెళతాం'' అని చెప్పి లేచారు చక్కా సుబ్బారావుగారు. అప్రయత్నంగా మా చేతులు జోడించాం.

★★★

ప్రతి సంవత్సరం వెల్లటూరు హైస్కూలులో 'నవరంగ్ చిత్ర కళానికేతన్' పేరిట బొమ్మల (పెయింటింగ్స్) పోటీలు ఆ స్కూలు డ్రాయింగు మాష్టారు వెల్లటూరి పూర్ణానంద శర్మగారు నిర్వహించేవారు. గుంటూరు జిల్లాలోని అన్ని పాఠశాలల పిల్లలు పోటీల కోసం బొమ్మలు వేసి పంపేవారు. వాటిలో బాగున్నవాటిని కొన్నింటిని ఎంపిక చేసి, ఫంక్షన్ పెట్టి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసేవారు. ఆ సంవత్సరం మా స్కూలు నుంచి మేము రంగులు వేసి పంపిన బొమ్మలకి బహుమతులు రావడం మాకెంతో ఆనందంగా వుంది.

ఈ వార్త మధ్యాహ్నం లంచ్ బెల్లుకి స్కూలంతా తెలిసిపోయింది. అప్పటిదాకా మమ్మల్ని ఒకలా చూసిన క్లాసుమేట్స్ మమ్మల్ని హీరోలుగా చూడసాగారు. ఆ ఆనందంలో క్యారే జీలో అన్నం కూడా సరిగ్గా తినబుద్ధి కాలేదు. ఎప్పుడు హోం బెల్లు కొడతారా? ఇంటికి తొందరగా పోయి ఈ వార్త అమ్మ, నాన్న, అన్నయ్యలు, నానమ్మలకీ చెబుదామా



అని ఆత్రంగా ఎదురుచూడసాగాను. మధ్యాహ్నం జరిగిన మూడు పిరియడ్స్‌లో ఒక్కటి కూడా సరిగ్గా వినలేదు. హోం బెల్లు కొట్టారు. స్కూలు నుంచి నేనింటికొచ్చేసరికి మా నాన్న ఇంకా ఇంటికి రాలేదు. నానమ్మ వాకిలూడుస్తోంది. అన్నయ్యలు ఎవ్వరూ కనపడలేదు. నాకు ప్రైజు వచ్చిన సంగతి నానమ్మతో చెబితే 'సరేలే, ఎప్పుడనగా తిన్నావో, కాళ్లు చేతులు కడుక్కుని బువ్వ తినయ్య' అంది. ఆమె మొహంలో ఏ రకమైన భావం లేదు.

తెల్లారి మా అన్నయ్య 'నార్టన్' సైకిలెక్కి నేను బయల్దేరబోతుంటే నాయనమ్మ ఎదురొచ్చి చీర కొంగుకు కట్టుకున్న రూపాయి బిళ్ల ఇచ్చింది 'సోడా తాగయ్య ఏడికిబోయినా ఏగాణి బొడ్డులో వుండాలి' అంటూ. జానీ సోడా కొట్టు దగ్గరకు నేను చేరుకునేసరికి మా స్నేహితులంతా నిమ్మకాయ సోడాలు తాగుతున్నారు. చక్కా సుబ్బారావు మాష్టారు నన్ను చూడగానే 'జానీ ఈ బాలక్కయకి కూడా ఒక నిమ్మకాయ సోడా' అన్నాడు. సోడాలు తాగి అందరం సైకిళ్ల మీద, మాష్టారు రిక్షా మీద వెల్లటూరు బయలుదేరాం. రైలుగేటు, దిబ్బ మీదపల్లి, మద్దుల గిరిరావు గారి ఫ్యాక్టరీ, తోట దాటి అటు వైపు నేనెప్పుడూ వెళ్లలేదు. దారిపొడవునా చెరుకు, అరటి తోటలు, పసుపు చేలు, దోస, బీరకాయ కూరగాయల తోటలతో పచ్చగా ఎంతో అందంగా వుంది.

మేము వెల్లటూరు వెళ్లేసరికి ఆ స్కూలు ఆవరణలో మాలాంటి స్కూలు పిల్లలు చాలా మంది గుమిగూడి ఉన్నారు. అందరూ గోలగోలగా ప్రతి క్లాసు రూమ్‌కి తిరుగుతున్నారు. క్లాసురూముల్లో పోటీలకొచ్చిన బొమ్మలు గోడల మీద అంటించి వున్నాయి. వాటిలో ఆయిల్ పెయింటింగ్, వాటర్ కలర్, పెన్సిల్‌తో వేసిన స్కెచ్‌లు వున్నాయి. ఆ బొమ్మలు చూస్తుంటే నాకెందుకో మేం రంగులేసి పంపిన బొమ్మలు అంత బాగాలేవేమో అనిపించింది. మరి ముఖ్యంగా నేనేసిన 'తాటికల్లు' అనే బొమ్మ వాటి ముందు చాలా తక్కువగా వున్నట్లు అనిపించింది నాకు. నాకన్నా, బాగా వేసిన బొమ్మలు చాలా వున్నాయి. మేము బొమ్మలు చూస్తూ వుండగానే ఏ బొమ్మకు ఏఏ రంగులు ఎట్లా అద్దాలో, ఏఏ కుంచెలు వాడాలో, ఎలాంటి పేపరో.... వివరంగా చెబుతున్నారు మా డ్రాయింగ్ మాష్టారు. ఇన్ని రంగుల బొమ్మలు చూడ్డం నా జీవితంలో ఇదే మొదటిసారి. అప్పుడే నేను కూడా పెద్ద ఆర్టిస్టునవ్వాలని మనసులో అనుకున్నాను. మేము చివరి గదిలో బొమ్మలు చూస్తూ వుండగా, 'మన ఆర్థిక మంత్రి అనగాని భగవంతరావుగారు విచ్చే స్తున్నారు. విద్యార్థులు, తోడు వచ్చిన టీచర్లంతా వచ్చి స్టేజీ ముందు ఏర్పాటు చేసిన బెంచీలలో కూర్చోవలసిందిగా కోరుతున్నాము' అని మైకులోంచి ఎనౌన్స్‌మెంట్ వినిపించింది.

మేమంతా వచ్చి కూర్చునేసరికి మంత్రిగారి కారు వచ్చింది. ముందుగా మంత్రిగారిని బొమ్మల కొలువు ఏర్పాటు చేసిన గదులకు నిర్వాహకులు తీసుకెళ్లారు. స్టేజీ మీద నుంచి మైకులో వచ్చే దేశభక్తి గీతాలు వినిపిస్తున్నాయి. మేమంతా అప్పటి దాకా చూసొచ్చిన బొమ్మల గురించి మాట్లాడుకో సాగాం. మంత్రిగారి స్టేజీ మీదకు రాగానే అందరం నిలబడి గౌరవ వందనం చేశాం. మంత్రిగారికి పూలమాల వేసి 'నవరంగ్ చిత్ర కళానికేతన్ స్థాపన ఉద్దేశం గురించి మాట్లాడుతూ, 'మీలోంచి అడవిబాపిరాజులు, వడా పాపయ్యలు, బాపు, పికాసో, రవివర్మ, మైఖేలేంజిలో లాంటి గొప్ప చిత్రకారులు వస్తారని.... నిరంతరం చిత్రలేఖనం అభ్యసించండని' ఒక మాష్టారు ప్రసంగం పూర్తిచేశారు.

''ఆయనే వెల్లటూరి పూర్ణానందశర్మగారని, ఆ స్కూలులో డ్రాయింగు మాష్టారని, ఇదంతా ప్రతి ఏడాది ఏర్పాటు చేసేది అయనేనని'' చక్కా సుబ్బారావు మాష్టారు మాకు చెపుతూంటే ఆయనెంత గొప్పవారో అనుకున్నాం. ప్రసంగాలు అయిన తర్వాత బహుమతి ప్రదానం కార్యక్రమం మొదలైంది. టిఎం రావు స్కూలు భట్టిప్రోలు అని అనౌన్స్ చేయ్యగానే మేమంతా లైనుగా వెళ్లాం. మాలో మాచర్ల రంగారావుకి, దొడ్డ భాస్కరరావుకి మాత్రం కేమెల్ రంగు బిళ్లల డబ్బాలు బహుమతిగా వచ్చాయి. నాకు 'హైలీ కమాండబుల్ సర్టిఫికెట్', మిగిలిన వారికి కమాండబుల్ సర్టిఫికెట్ వచ్చాయి.

బహుమతి ప్రదానం అయిన తర్వాత మంత్రిగారు ప్రసంగం చేశారు. రంగులలో పిల్లల భావాలు చక్కగా తెలియజేశారనీ, గూటిలో వున్న పిల్లకు పురుగును ముక్కుతో పట్టుకొని వచ్చి తల్లి పక్షి పెట్టడం, చాలా బావుందనీ, అలాగే పిల్లల భావాలు తెలియజేసే బొమ్మలు కొన్నింటి గురించి చెబుతూ, నేను వేసిన 'తాటికల్లు' బొమ్మ గురించి కూడా చెప్పారు. తాటికల్లు గీయడం సాహసంతో కూడినదని, తాటిచెట్టు ఎక్కి దిగడం చాలా కష్టమైన పనని, తాటికల్లులో విటమిన్లు వుంటాయని అది ప్రకృతి ప్రసాదించిన వరమని చెప్పారు. ప్రోగ్రాం అయిపోయి మేమంతా బయటకొచ్చేసరికి రాత్రి ఎనిమిది గంటలయింది.

''రేపు ఉదయం మీకొచ్చిన సర్టిఫికెట్లు తీసుకొని స్కూలుకు రండర్రా బాలక్కాయలూ'' అని చెప్పి చక్కా సుబ్బారావు మాష్టారు రిక్షా ఎక్కి వెళ్లిపోయారు. మేమంతా సైకిళ్ల మీద భట్టిప్రోలు చేరేసరికి పార్వతి టాకీసులో రెండో ఆట సినిమా కోసం మైకులోంచి పాటలు వినిపిస్తున్నాయి. పార్వతి టాకీసులో 'బుద్ధిమంతుడు' సిన్మా ఆడుతోంది. ఆ సిన్మా అంటే నాకు చాలా ఇష్టం. ఎన్ని సార్లు చూసినా మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది. దాంట్లోని 'టాటా వీడుకోలు... గుడ్ బై ఇంక సెలవు' అనే పాటంటే నాకెంతో ఇష్టం. నేను, సాంబశివరావు, రంగారావు, సినిమాహాలు ఎదురుగా వున్న కాళిదాసు దగ్గర ఇడ్లీలు తిని, నాగేశ్వర్రావు దగ్గర టీ తాగి సిన్మా చూశాం.

నేను సెకండ్‌షో చూసి ఇంటికి చేరేసరికి అందరూ నిద్రపోతున్నారు. నాయనమ్మ మాత్రం నా కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. నేను కాళ్లు, చేతులు కడుక్కొని వచ్చేసరికి అన్నం పెట్టేసింది. అన్నం తింటూ ఫంక్షన్‌లో జరిగిన సంగతులు చెబుతూ, 'నే వేసిన తాటిచెట్లు, తాటికల్లు మనిషి మోకుతో తాటిచెట్లు ఎక్కడం, కల్లు గీయడం.. కుండలు కిందకు దించి కల్లుపోయడం... కొంత మంది కల్లు తాగడం గురించి... మంత్రిగారు స్టేజీ మీద చెప్పారని కూడా చెప్పాను. ఆయన మన ఆర్థిక మంత్రి అనగాని భగవంతరావుగారని, ఆయనది మనవూరి పక్కనున్న అనగానివారి పాలెం అని చెప్పాను. ఆమెకు ఏమి అర్థమైందో కానీ.... 'తొందరగా పడుకో. ఇప్పటికే చాలా పొద్దుపోయిందని' చెప్పి నిద్రపోయింది. ఏమీ చదువుకోని ఆమెకు బొమ్మల గురించి, రంగుల గురించి, మంత్రిగారి గురించి ఏం తెలుసు అనుకుంటూ చెయ్యి కడుక్కొని నిద్రపోయా.

ఉదయాన్నే నేను నిద్ర లేచేసరికి చాలా పొద్దెక్కింది. నేను తయారయి స్కూలుకి చేరేసరికి క్లాసురూంలో ఒక్కరూ లేరు. అందరూ అసెంబ్లీకెళ్లారని వాచ్‌మెన్ పోతురాజు చెప్పేసరికి నేనూ అసెంబ్లీకెళ్లాను. నన్ను చూసి చక్కా సుబ్బారావు మాష్టారు 'ఇంతలాస్యమైందేమిరా బాలకా! బుద్ధిమంతుడా!' పోయి ముందు వరుసలో కూర్చో అన్నారు.

స్కూలు పిల్లలతో పొట్టి శ్రీరాములు అసెంబ్లీ హాలు నిండిపోయింది. టీచర్లంతా స్టేజీ ముందు కుర్చీల్లో కూర్చున్నారు. పిల్లలంతా క్లాసుల వారీగా వారి వెనక కూర్చున్నారు. ముందుగా చక్కా సుబ్బారావు మాష్టారు, డ్రాయింగు మాష్టారు మాట్లాడిన తర్వాత హెడ్మాష్టారు మాట్లాడుతూ బొమ్మల పోటీల గురించి వాటిల్లో మా స్కూలుకొచ్చిన ప్రైజులు, సర్టిఫికెట్ల గురించి చెబుతూ మేమంతా స్కూలుకి మంచి పేరు తెచ్చామని, మమ్మల్ని పొగిడి.. మమ్మల్ని పేరుపేరున స్టేజీ మీదకు పిలిచి, ఒక్కొక్కరికి ఒక్కో అశోక్ పెన్ను బహుమతిగా ఇచ్చారు. ఆ తర్వాత స్కూలుకి సెలవు ప్రకటించారు. అప్పుడు మోగిన చప్పట్లు మాకు బహుమతులిచ్చేటప్పుడు కూడా మోగలేదు. ఆ తర్వాత మా స్నేహితులంతా మాకొచ్చిన సర్టిఫికెట్లు, బహుమతులు చూసి అభినందించారు.

నేనింటికొచ్చి సైకిల్‌ను వేపచెట్టు కింద పెడుతూ లోపలికి తొంగి చూసేసరికి, పంచలో పదిమందికి పైగా ముసలోళ్లు, నడివయస్సు ఆడోళ్లు చేతుల్లో గ్లాసులు, కంచాలతో కూర్చుని వున్నారు. మా నాయనమ్మ వారందరికీ సేమియా పాయసం వడ్డిస్తోంది. 'మా రాజుబాబు బడిలో రంగులతో బొమ్మలు వేస్తే దానికి వెల్లటూరులో మంత్రిగారు ప్రైజు ఇచ్చాడంట! రాజు వేసిన బొమ్మ చాలా బాగుందని అందరికీ చెప్పాడంట ఆ మంత్రిగారు. ఆయనది మన ఊరు పక్కనున్న అనగానివారి పాలెం. ఆయనకి మనూర్లో కూడా బంధువులు న్నారు. పాయసం కడుపు నిండా తాగండి, డేగిసా నిండా వుంది.' అని నాయనమ్మ పాయసం వడ్డిస్తూ చెబుతుంటే నేను ఇంట్లోకెళ్లకుండా మెల్లగా బయటకొచ్చేశా.

మంత్రిగారి మాటలకన్నా, చక్కా సుబ్బారావు గారి, డ్రాయింగ్ మాష్టారు గారి మెచ్చుకోలుకన్నా, హెడ్మాష్టారిచ్చిన బహుమతి కన్నా ఏమీ చదువు కోని మా నాయనమ్మ ప్రేమ నన్ను ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చేసింది.

(సమాప్తం)

# రచయిత పరిచయం



పుట్టింది, పెరిగింది ఐలవరంలో అంజయ్య, దయమ్మలకు. ప్రాథమిక విద్య ఊరిలోనే! హైస్కూలు విద్య టిఎం రావ్ హైస్కూలు, భట్టిప్రోలులో పన్నెండు కిలో మీటర్లు రానూపోనూ నడిచి వెళ్లి. ఇంటర్, మెడిసిన్ గుంటూరులో. పిజి చేసింది (ఇఎన్‌టి)కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో. ఇప్పటి వరకూ డజను కథలు దాదాపు అన్ని పత్రికలలో అచ్చయినాయి.

నా మొదటి కథ 'పరమాన్నం' అచ్చయింది సెప్టెంబర్ 2004 'నవ్య'లో. హెలెక్స్‌హేలీ ద రూట్స్, మార్క్ ట్వేన్, డాక్టర్ కేశవరెడ్డి రచనలంటే చాలా ఇష్టం. చార్లీచాప్లిన్, ఎస్వీఆర్, సావిత్రి, శివాజీగణేష్, వి.శాంతారాం, కెవి.రెడ్డి, భారతీరాజా, బాలచందర్ సిన్మాలంటే పిచ్చి. ఇళయరాజా సంగీతమంటే ప్రాణం. అందుకే మా పెద్దాబ్బాయి పేరు ఇళయరాజా, చిన్నోడి పేరు భారతీరాజా అని పెట్టుకున్నాను. నా అర్థాంగి డాక్టర్ నందిని. స్కానింగ్ స్పెషలిస్ట్. నా కథలన్నీ మొదట స్కాన్ చేసేది నా శ్రీమతి, పిల్లలే. భట్టిప్రోలు కథలు రాయడంలో ఉత్సాహపరిచి, ప్రోత్సహించింది, కాన్సెప్ట్ చెప్పింది డాక్టర్ కేశవరెడ్డి. కోయ కోటేశ్వరరావు, అన్నయ్య మోహన్ కుమార్‌లు. మదర్‌థెరిస్సాను మెడికల్ కాలేజీకి పిలిచి సన్మానం చేసి ఆమెతో ఫోటో దిగడం జీవితంలో మరిచిపోలేని సంఘటన. అప్పుడు నేను సోషల్ సర్వీస్ సెక్రటరీని.

ఈ మధ్య నా ఆరోగ్యం బాగోపోతే నా స్నేహితులు స్పందించిన తీరు ఎప్పటికీ మరిచి పోలేనిది. అందుకే స్నేహితులన్నా, స్నేహానికి అర్థం చెప్పే బాపు, రమణలన్నా చాలా చాలా ఇష్టం. స్నేహమేరా జీవితం! స్నేహమేరా శాశ్వతం! సెంట్రల్ హెల్త్ సర్వీసెస్‌లో (CGHS)లో చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఉద్యోగం. భట్టిప్రోలు కథలు ప్రచురించిన నవ్యకి హృదయపూర్వక ధన్యవాదములు. నా కథలు చదివి, స్పందించి, ఉత్తరాల ద్వారా ఫోన్ల ద్వారా అభినందనలు తెలిపిన పాఠకులకు మెనీ మెనీ థాంక్స్.

– నక్కా విజయరామరాజు